# శతాబ్దాల వివాదాన్ని అధిగమించి..

న్యూఢిల్లీ, జనవరి 21: శతాబ్దాల హిందువుల కల మరికొన్ని గంటల్లో నెరవేరబోతున్నది. అయోధ్యలో రామమందిరం నేడు ప్రారంభం కానున్నది. ఎన్నో వివాదాలు, న్యాయపోరాటాల తర్వాత ఇది సాకారమవుతున్నది. ఈ నేపథ్యంలో రామమందిర ప్రస్థానంలో చోటుచేసుకున్న ముఖ్యమైన ఘట్టాలను ఓ సారి పరిశీలిద్దాం..

**1528:** రాముడి జన్మస్థలమైన అయోధ్యలో ఆలయాన్ని కూల్చి మొఘల్ చక్రవర్తి బాబర్ వద్ద పనిచేసే జనరల్ మీర్ బాఖి ఒక మసీదును నిర్మించాడనే వాదనలు ఉన్నాయి.

**1853:** బాబ్రీ మసీదు విషయంలో బ్రిటిష్ కాలంలో మొదటిసారిగా 1853లో హింస చెలరేగింది. 1859లో వివాద స్థలాన్ని బ్రిటిషర్లు రెండుగా విభజించి, కంచె వేశారు.

**1949:** బాబ్రీ మసీదు లోపల కొందరు రాముడి విగ్రహాలను ప్రతిష్ఠించారు.

**1950:** రాముడికి పూజలు చేసేందుకు అనుమతించాలని హిందువుల తరఫున గోపాల్ సింగ్ విశారద్, మసీదులో విగ్రహాలను తొలగించాలని హసీం అన్సారీ ఫైజాబాద్ కోర్టులో పిటిషన్లు వేశారు. దీంతో ప్రభుత్వం ఆ స్థలాన్ని వివాదాస్పద ప్రాంతంగా ప్రకటించి తాళాలు వేసింది.

**1980:** శ్రీరామ జన్మభూమికి విముక్తి కలిగించి, ఆలయాన్ని నిర్మించాలన్న డిమాండ్‌తో వీహెచ్‌పీ నేతృత్వంలోని ఓ కమిటీ ఉద్యమం ప్రారంభించింది.

**1990:** రామాలయ నిర్మాణానికి మద్దతుగా బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ గుజరాత్‌లోని సోమ్‌నాథ్ నుంచి యూపీలోని అయోధ్య వరకు రథయాత్ర చేపట్టారు.

**1992:** డిసెంబర్ 6న వేలాది మంది కరసేవకులు, వీహెచ్‌పీ కార్యకర్తలు వివాదాస్పద నిర్మాణాన్ని కూల్చివేశారు. ఇది దేశంలో మత ఉద్రిక్తతలకు దారితీసింది.

**2003:** వివాదాస్పద స్థలంలో ఏఎస్‌ఐ సర్వే చేపట్టింది. మసీదు నిర్మాణం కింద ఒక హిందూ నిర్మాణం ఉండేదని నివేదించింది. దీన్ని ముస్లింలు వ్యతిరేకించారు.

**2010:** విస్తృత విచారణ చేసిన అలహాబాద్ హైకోర్టు.. ఆ భూమిని మూడు భాగాలుగా చేసి, రామ్‌లల్లా, ఇస్లామిక్ వక్ఫ్ బోర్డ్, నిర్మోహి అఖారాలకు కేటాయించింది.

**2011:** మూడు పక్షాలు సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో.. హైకోర్టు తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది.

**2019:** సుప్రీంకోర్టు ఈ కేసును మధ్యవర్తిత్వం కోసం సిఫారసు చేసింది. మధ్యవర్తితంలో ఏకాభిప్రాయం రాకపోవడంతో రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ. రోజువారీ విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. 2019, ఆగస్టు 16న తీర్పు రిజర్వ్ చేసింది.

**2019, నవంబర్ 9:** సుప్రీంకోర్టు రామ్‌లల్లాకు అనుకూలంగా తీర్పునిస్తూ వివాదాస్పద 2.77 ఎకరాల భూమిని కేంద్రం ఏర్పాటు చేసిన ట్రస్టుకు అప్పగించింది. మసీదు నిర్మాణానికి మరోచోట 5 ఎకరాలు కేటాయించాలని ఆదేశించింది.

**2020:** రామ్‌లల్లా విగ్రహాన్ని టెంట్ నుంచి తాత్కాలిక ఆలయానికి తరలింపు.

2020, ఆగస్టు 5న రామాలయ నిర్మాణానికి ప్రధాని మోదీ శంకుస్థాపన.

**2024, జనవరి 22:** దాదాపు నాలుగేండ్ల పాటు సాగిన నిర్మాణం తర్వాత.. దేశంలోని హిందువులు దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న బాలరాముడి ప్రాణప్రతిష్ఠ జనవరి 22న జరగబోతున్నది.




# నేడే అయోధ్య రాముడి అవతరణ

**మధ్యాహ్నం 12.20కు కార్యక్రమం**

- ప్రధాని మోదీ ఆధ్వర్యంలో వేడుక • హాజరవనున్న 7 వేలకు పైగా అతిథులు
- భద్రత ఏర్పాట్లు కట్టుదిట్టం • రేపటి నుంచి భక్త కోటికి దర్శన భాగ్యం
- రామనామ స్మరణలో హిందువులు • తన్మయత్వంతో ఊగిపోతున్న భక్తులు



ఆదివారం రాత్రి విద్యుత్తు దీపాల కాంతులు, పూల అలంకరణతో వెలిగిపోతున్న అయోధ్య రామ మందిరం



బికనేర్‌లో రాముడి వేషధారణలో నవ్వులు చిందిస్తున్న బాలుడు

అయోధ్య, జనవరి 21: ప్రపంచమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠకు వేళయింది. సోమవారం మధ్యాహ్నం 12.20 గంటలకు మొదలై మధ్యాహ్నం ఒంటి గంటలకు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ముగుస్తుంది. రామమందిరంలో బాలరాముడి రూపంలో శ్రీరాముడు కొలువు దీరనున్నాడు. ప్రధాని నరేంద్ర మోదీ సహా 7 వేల మందికి పైగా ప్రముఖులు, అతిథుల సమక్షంలో ఈ మహత్తర కార్యం జరగనున్నది. ఈ కార్యక్రమ ప్రత్యక్ష ప్రసారాన్ని లక్షల మంది టీవీలు, స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్‌లలో వీక్షించనున్నారు. ఈ శుభ ముహూర్తాన దేశ విదేశాల్లోని హిందూ దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టనున్నారు. వాషింగ్టన్ డీసీ నుంచి ప్యారిస్.. సిడ్నీ దాకా దాదాపు 60 దేశాల్లో విశ్వహిందూ పరిషత్తు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అయోధ్యలో ఈ వేడుక కోసం శ్రీరామజన్మభూమి తీర్థ్ క్షేత్ర ట్రస్టు, అధికార వర్గాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి. రామ మందిరం మొత్తం పూలతో, విద్యుద్దీప కాంతులతో అలంకరించారు. అయోధ్య వీధులను సుందరంగా తీర్చిదిద్దారు. దేశంలోని 14 జంటలు ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో పాలు పంచుకొంటున్నాయి. ఇప్పటికే ఈ నెల 16 నుంచి ప్రారంభమైన వేడుకలు.. మంగళవారం వరకు కొనసాగనున్నాయి.

### భద్రతా వలయంలో అయోధ్య

ప్రాణ ప్రతిష్ఠ కోసం దేశంలోని అత్యంత ప్రముఖులు రానున్న నేపథ్యంలో అధికార వర్గాలు భద్రతను కట్టుదిట్టం చేశాయి. నగర మూలమూలన పోలీసులు జల్లెడ పడుతున్నారు. అయోధ్య వైపు వచ్చే అన్ని దారులను మూసివేసి, అనుమతిలేని వారిని నిలువరిస్తున్నారు. జైషేమహ్మద్ హెచ్చరికల నేపథ్యంలో భద్రతా బలగాలు మరింత అప్రమత్తమయ్యాయి. నగరంలో బహుళ అంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ప్రజల కదలికలపై 10 వేల సీసీటీవీ కెమెరాలతో నిఘా పెట్టడంతో పాటు ప్రారంభోత్సవ వేదిక వద్ద బహుభాషా నైపుణ్యం కలిగిన పలువురు పోలీసు సిబ్బందిని మఫ్టీలో మోహరించారు. యూపీ యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్(ఏటీఎస్) పోలీసులు శనివారం అయోధ్య నగరంలోని హనుమాన్‌గర్హి ఏరియా తదితర ప్రాంతాల్లో పెట్రోలింగ్ చేపట్టారు. సరయూ నదీ తీరాన ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపినట్టు అధికారులు వెల్లడించారు. మరోవైపు వీవీఐపీల రాక సందర్భంగా ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. మెరుగైన భద్రత కోసం ఏఐ సాంకేతికతను కూడా వినియోగించుకొంటున్నట్టు లా అండ్ ఆర్డర్ డీజీ ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. అటు.. తగినంత మంది అత్యవసర వైద్య సిబ్బందిని కూడా అందుబాటులో ఉంచారు. స్థానిక దవాఖానల్లో సరిపడా బెడ్లు ఏర్పాటు చేశారు.

### 10 లక్షల దీపాల కాంతులు

సోమవారం సాయంత్రం అయోధ్య దీపాల కాంతులతో ధగధగాయమానంగా వెలిగిపోనున్నది. మొత్తం 10 లక్షల దీపాలు వెలిగించనున్నారు. రామమందిరం సహా నగరంలో ఉన్న రామ్ కీ పైడీ, కనక్ భవన్, గుప్తార్ ఘాట్, సరయు ఘాట్, లతామంగేష్కర్ చౌక్, మణిరాం దాస్ ఛవని తదితర ప్రాంతాలు, దాదాపు వెయ్యి ఆలయాలు ఈ దీపాల కాంతులతో వెలిగిపోనున్నాయి. ఈ దీపోత్సవాన్ని ఉత్తరప్రదేశ్ సర్కారు నిర్వహిస్తున్నది. ఇక, ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం ముగిశాక, మంగళవారం నుంచి బాలరాముడు సాధారణ భక్తులకు దర్శనం ఇవ్వనున్నాడు.

## వీఐపీలకు అయోధ్య 'మహా ప్రసాదం'

అయోధ్య: రామమందిర ప్రారంభోత్సవానికి విచ్చేసే వీఐపీలకు నిర్వాహకులు మహాప్రసాదాన్ని అందజేయనున్నారు. నెయ్యి, ఐదు రకాల డ్రై ఫ్రూట్లు, చక్కెర, శనగ పిండితో తయారు చేసిన ఈ మహాప్రసాదాన్ని 20 వేలకు పైగా ప్యాకెట్లను సిద్ధం చేస్తున్నట్టు ఆలయ ట్రస్ట్ ప్రకటించింది. ట్రస్ట్ పర్యవేక్షణలో ఐదు వేల కేజీలకు పైగా ఉన్న పదార్థాలతో 200 మంది గుజరాత్‌కు చెందిన భాగవ సేన భారతి గార్వి, సంత్ సేవా సంస్థాన్‌లు ఈ మహాప్రసాదాన్ని తయారు చేస్తున్నాయి. అలాగే ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి విచ్చేసే సాధువులు, ఇతరులకు బస, భోజన ఏర్పాట్లను చేసినట్టు ట్రస్ట్ తెలిపింది. చిరు ధాన్యాలతో తయారు చేసిన ఆహారాన్ని ప్రతి రోజు 5 వేల మందికి అందిస్తామని పేర్కొన్నది.

## రామాయణ వెబ్‌సైట్ ప్రారంభం

లక్నో: ఐఐటీ కాన్పూర్ రామాయణ వెబ్‌సైట్‌ను ఆవిష్కరించింది. 'వాల్మీకి.ఐఐటీకే.ఏసీ.ఇన్' పేరుతో వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. నెటిజన్లు వెబ్‌సైట్‌లో లాగిన్ అయిన తర్వాత, వాల్మీకి రామాయణంలోని శ్లోకాలు, వాటి అనువాదం పొందవచ్చునని ఐఐటీ కాన్పూర్ ఓ ప్రకటన విడుదల చేసింది. తమ వద్ద ఉన్న సమాచారాన్ని పంపి, వెబ్‌సైట్‌లోని కంటెంట్‌ను ఎడిట్ కూడా చేయవచ్చని తెలిపింది.

## రామయ్య నుదుట 'సూర్య తిలకం'

**ఏటా శ్రీరామ నవమినాడు సూర్య కిరణాలు పడేలా ప్రత్యేక వ్యవస్థ**

న్యూఢిల్లీ: ఏటా శ్రీరామనవమి నాడు అయోధ్యలో రాముడి నుదుటపై సూర్య కిరణాలు ప్రసరించేలా ఆలయ నిర్మాణం జరుపుకుంటున్నది. రామ నవమి రోజున మధ్యాహ్నం 12 గంటలకు మొదలై 6 నిమిషాలపాటు సూర్య కిరణాలు గర్భగుడిలోని శ్రీరాముడి విగ్రహం నుదిటిపై ప్రసరించేలా సీఎస్ఐఆర్‌కు చెందిన 'సెంట్రల్ బిల్డింగ్ రిసెర్చ్ ఇనిస్టిట్యూట్' (సీబీఆర్ఐ) సైంటిస్టులు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశారు. పాణిగ్రాహి నేతృత్వంలోని బృందం ఈ వ్యవస్థకు రూపకల్పన చేసింది. సీబీఆర్ఐ సైంటిస్టు ఆర్ ధర్మ రాజు మాట్లాడుతూ, 'సూర్య కిరణాలు మూడో అంతస్తుపై ఉండే శిఖరం నుంచి గర్భగుడిలోని విగ్రహంపై ప్రసరిస్తాయి. ఆలయం నిర్మాణం పూర్తయిన తర్వాతే 'సూర్య తిలకం' ఆవిష్కృతం అవుతుంది' అని చెప్పారు. 'ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్' నుంచి సీబీఆర్ఐ సైంటిస్టులు సాయం తీసుకున్నారు. కావాల్సిన వస్తువులను, పరికరాలను బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న 'ఆప్టిక్' సంస్థ తయారుచేసింది.

## పూల వ్యర్థాల నుంచి అగరొత్తులు

లక్నో, జనవరి 21: అయోధ్యలోని వివిధ దేవాలయాల్లో సమర్పించే పూలతో అగరుబత్తీలు తయారుచేసేందుకు, జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లో పనిచేస్తున్న మహిళలకు ఉపాధి కల్పించేందుకు అయోధ్య మున్సిపల్ కార్పొరేషన్ వినూత్న ప్రాజెక్టును చేపట్టింది. అయోధ్యలోని ఆలయాల్లో పూల వ్యర్థాల సేకరణ, రీసైక్లింగ్ నిమిత్తం 'ఫూల్' అనే కంపెనీతో అయోధ్య మున్సిపల్ కార్పొరేషన్ ఒక అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. ఆలయాల ప్రాంగణంలో పరిశుభ్రతను పాటించటం కోసం వినూత్నమైన ఈ ప్రాజెక్టును చేపట్టామని, సోమవారం ప్రాణ ప్రతిష్ఠ తర్వాత కూడా ఈ ప్రాజెక్ట్ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. సోమవారం నుంచి రోజుకు 9 టన్నుల పూల వ్యర్థాలు రావొచ్చునని అధికారులు అంచనావేస్తున్నారు.

## తిరుమలలో అయోధ్యకాండ అఖండ పారాయణం

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): లోక కల్యాణం కోసం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమలలోని నాద నీరాజనం వేదికపై ఆదివారం ఉదయం జరిగిన 6వ విడత అయోధ్య కాండ అఖండ పారాయణం భక్తులను భక్తిసాగరంలో ముంచెత్తింది. ఉదయం 7 నుంచి 9 గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేసింది. అయోధ్యకాండలోని 18 నుంచి 21వ సర్గ వరకు మొత్తం నాలుగు సర్గల్లో 199 శ్లోకాలు, యోగ వాశిష్టం, ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు కలిపి మొత్తం 224 శ్లోకాలను పారాయణం చేశారు.


## నిత్యానందకు రామాలయ ఆహ్వానం!

**హాజరవుతానని వెల్లడి**

న్యూఢిల్లీ, జనవరి 21: పరారీలో ఉన్న లైంగిక దాడి నిందితుడు నిత్యానంద తనకు అయోధ్య రామాలయ ప్రారంభోత్సవానికి ఆహ్వానం అందిందని వెల్లడించారు. తాను ఈ వేడుకకు హాజరవుతున్నానని తెలిపారు. 'చారిత్రక, అపూర్వమైన ఈ వేడుకకు హాజరవ్వకుండా ఉండొద్దు. ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రపంచం మొత్తాన్ని దీవించేందుకు శ్రీరాముడు లాంఛనంగా ఈ ఆలయంలో కొలువు దీరనున్నాడు' అని కైలాస దేశం ఎక్స్ ఖాతాలో ఆయన పోస్ట్ చేశారు. లైంగిక దాడి కేసులో బెయిల్‌పై విడుదలైన నిత్యానంద 2020లో దేశం విడిచిపెట్టి పారిపోయారు.

# కొత్త విగ్రహం అందుకే

అయోధ్య: అయోధ్యలో రామాలయ నిర్మాణానికి ఇప్పటివరకు 1100 కోట్ల రూపాయలకు పైగా వ్యయం అయినట్టు శ్రీరామ జన్మభూమి తీర్థ ట్రస్ట్ కోశాధికారి గోవింద్ దేవ్ వెల్లడించారు. అయితే ఆలయ పనులు పూర్తి కావడానికి ఇంకో 300 కోట్ల రూపాయలు అవసరమవుతాయని చెప్పారు. తాత్కాలిక మందిరంలోని ఐదారు అంగుళాల పాత రామ్ లల్లా మూర్తిని కొత్త విగ్రహం ముందు ఉంచుతామని చెప్పారు. ఇది తక్కువ ఎత్తుతో ఉండటంతో 25-30 అడుగుల దూరం నుంచి భక్తులకు సరిగా కనబడదని, అందుకే దాని స్థానంలో 51 అంగుళాల కొత్త విగ్రహాన్ని తయారు చేయించినట్టు చెప్పారు. గర్భగుడిలో ప్రతిష్ఠకు మూడు విగ్రహాలను తయారు చేయగా, అందులో మైసూర్ శిల్పి అరుణ్ యోగిరాజ్ చేసిన దానిని ఎంపిక చేశారని, మిగిలిన రెండు విగ్రహాలను కూడా ఆలయంలోనే ఉంచి అన్నిరకాల ఆలయ మర్యాదలతో పూజాధికాలు నిర్వహిస్తామన్నారు. ఒక దానిని శ్రీరాముడికి నగలు, దుస్తులు తయారీకి అవసరమైన కొలతలు తీసుకునేందుకు ఉంచుతామని, కొత్త విగ్రహాల తయారీకి నాలుగైదు నెలల సమయం పట్టిందని ఆయన చెప్పారు.




## ఇనుము, ఉక్కు ఎందుకు వాడలేదు?

అయోధ్య: అయోధ్య ఆలయాన్ని ఇసుక నేల ప్రాంతంలో 12-14 మీటర్ల లోతు వరకు ఇసుక తొలగించి ప్రత్యేకంగా తయారుచేసిన కాంపాక్టెడ్ కాంక్రీట్‌తో చేసిన పునాదిపై నిర్మించారు. 2500 ఏండ్ల పాటు భూకంపాలు తట్టుకొనేలా ఉండేందుకు, ఇటుకల మధ్య ఉండే డ్రై జాయింట్ నిర్మాణాలు వెయ్యేండ్లు మన్నేలా ఉండేందుకు కేవలం పరస్పరం అనుసంధానమైన రాళ్లతోనే నాగర శైలిలో ఆలయాన్ని డిజైన్ చేశారు. నిర్మాణాల పటిష్ఠత కోసం సంప్రదాయబద్ధమైన ఇలాంటి నిర్మాణ శైలిలో ఇనుము, ఉక్కు వంటి వాడకుండా కేవలం రాళ్లతోనే నిర్మాణాలు చేపడతారు. అయోధ్య ఆలయాన్ని కూడా అందుకే ఇనుము, ఉక్కు వాడకుండా నిర్మించారు.

**• అంతరిక్షం నుంచి అయోధ్య చిత్రాలు**



అయోధ్యలో రామాలయం ప్రారంభోత్సవంలో ఇస్రో కూడా పాలుపంచుకుంటున్నది. దేశమంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ వేడుక సందర్భంగా అయోధ్య నగరం, రామాలయ శాటిలైట్ చిత్రాలను ఇస్రో ఆదివారం విడుదల చేసింది.




ముంబై, జనవరి 21 (నమస్తే తెలంగాణ): అయోధ్యలో రామమందిరం ప్రారంభోత్సవం నేపథ్యంలో మహారాష్ట్రలోని చంద్రపూర్‌లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. 33,258 దీపాలతో 'సియావర్ రామచంద్ర కీ జై' అనే 11 అక్షరాల రామ నామ మంత్రాన్ని 100 చదరపు అడుగుల విస్తీర్ణంలో అలంకరించారు. చంద్రపూర్‌లోని చందా క్లబ్ మైదానంలో శనివారం రాత్రి నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సుధీర్ ముంగంటివార్‌తోపాటు వేలాది మంది భక్తులు హాజరయ్యారు. గిన్నిస్ రికార్డు పత్రాన్ని ప్రతినిధులు ఆదివారం మంత్రి సుధీర్‌కు అందజేశారు. శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ లైబ్రరీ ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

## ప్రాణప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారం నిలిపివేతకు ఆదేశాలు!

- తమిళ నాడుపై సీతారామన్ ఆరోపణ
- తీవ్రంగా ఖండించిన స్టాలిన్ ప్రభుత్వం

న్యూఢిల్లీ, జనవరి 21: తమిళనాడు ప్రభుత్వంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్ర ఆరోపణలు చేశారు. సోమవారం జరిగే ప్రాణ ప్రతిష్ఠ ప్రత్యక్ష ప్రసారాన్ని తమిళనాడు ప్రభుత్వం నిషేధించిందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 200 రామాలయాలతో పాటు మిగిలిన దేవాలయాలలో అన్నదానం, పూజా కార్యక్రమాలు చేపట్టరాదని హెచ్ఆర్ అండ్ సీఈ శాఖ మౌఖిక ఆదేశాలు జారీ చేసిందని ఓ పత్రిక కథనాన్ని ఉటంకిస్తూ ఆరోపించారు. కేంద్ర మంత్రి ఆరోపణలను స్టాలిన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని మంత్రి శేఖర్ అన్నారు.


## సెలవుపై వెనక్కి తగ్గిన ఢిల్లీ ఎయిమ్స్

న్యూఢిల్లీ, జనవరి 21: అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటించిన సగం రోజు సెలవును ఢిల్లీ ఎయిమ్స్ ఉపసంహరించుకుంది. 'రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో ఓపీతో పాటు అన్ని క్లినికల్ సేవలు జనవరి 22న యథావిధిగా కొనసాగుతాయి' అని ఆదివారం జారీ చేసిన తాజా మెమొరాండం తెలిపింది. లేడీ హార్డింగ్ వైద్య కళాశాల కూడా సోమవారం అన్ని వైద్య సేవలను అందిస్తామని వెల్లడించింది.

# ఏఐతో సైబర్ నేరగాళ్లపై నిఘా

- అయోధ్య లైవ్, కాలర్ ట్యూన్స్, విరాళాలు, ప్రసాదం, వీఐపీ పాస్‌ల పేరిట మోసాలు
- అయోధ్యలో సైబర్ నిపుణుల నిఘా

హైదరాబాద్, జనవరి 21 (నమస్తే తెలంగాణ): దేవుడి పేరుతో ఆన్‌లైన్‌లో డబ్బులు దండుకుంటున్న సైబర్ నేరగాళ్లపై ఏఐతో జాతీయ సైబర్ క్రైమ్ పోలీసులు గస్తీ కాస్తున్నారు. రామ్‌లల్లా ప్రాణ ప్రతిష్ఠ నేపథ్యంలో సైబర్ నేరగాళ్లు అయోధ్య లైవ్, రాముడి కాలర్ ట్యూన్స్, విరాళాలు, ప్రసాదం, వీఐపీ పాస్‌లు అంటూ అమాయకుల నుంచి అందినకాడికి దండుకుంటున్నారు. అప్రమత్తమైన జాతీయ సైబర్ క్రైమ్ పోలీసులు ఉన్నతస్థాయి సైబర్ నిపుణుల బృందంతో అయోధ్య కేంద్రంగా నిఘా వేశారు. అయోధ్య, జై శ్రీరామ్, రామ్, రామ్‌లల్లా, ప్రాణ్ ప్రతిష్ఠ్ లైవ్, అయోధ్య లైవ్, ఆఫరింగ్స్, అయోధ్య ట్రైన్, ఫ్లైట్ టికెట్లు వంటి కొన్ని పదాలతో ఆన్‌లైన్‌లో ఎవరు వెతికినా.. ఆ వివరాలు ఐ4సీకి అందేలా ఏఐ సాయం తీసుకుంటున్నట్టు తెలిసింది. సైబర్ నేరగాళ్లు పంపే లింకులపై నిరంతరం ఏఐతో నిఘా ఉంటుందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో అధికారి చెప్పారు. 'అయోధ్య లైవ్' పేరుతో వచ్చే లింకులు ఓపెన్ చేయొద్దని తెలంగాణ సైబర్ క్రైమ్ పోలీసులు ఇప్పటికే ప్రజలను హెచ్చించారు.




## 9,999 వజ్రాలతో అయోధ్య కోవెల

న్యూఢిల్లీ: అయోధ్య మందిర ప్రారంభోత్సవం నేపథ్యంలో దేశమంతా రామభక్తిలో మునిగితేలుతున్నది. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఓ కళాకారుడు 9,999 వజ్రాలతో అయోధ్య రామ మందిరాన్ని రూపొందించాడు. నల్లని అట్టపై సన్నని వజ్రాలను అతికించి అద్భుతంగా తీర్చిదిద్దిన ఈ మందిరం చూపరులను కండ్లు తిప్పుకోనివ్వడం లేదు. ఆలయంపైన ఎడమవైపున 'జైశ్రీరాం' అని రాయగా, కుడివైపున విల్లంబులు ధరించిన రామయ్య నడిచివస్తున్నట్టుగా చిత్రీకరించాడు.

## రాగి నాణెంపై రాములోరు..



సిరిసిల్ల టౌన్, జనవరి 21: రాజన్నసిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన కొత్వాల సాయిరాం 25 ఏండ్ల నుంచి నాణేలు, స్టాంపులు, అరుదైన వస్తువులు సేకరిస్తున్నారు. గతేడాది శ్రీరాముడి చిత్రంతో కూడిన నాణేన్ని సేకరించారు. అయోధ్య రాముడి ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని తన వద్ద ఉన్న రాముడి బొమ్మతో కూడిన రాగి నాణేలను ఆదివారం మీడియా ముందు ప్రదర్శించారు. భవిష్యత్ తరాలకు శ్రీరాముడి చరిత్రను తెలిపేందుకు తనవద్ద ఉన్న రాగినాణేలతో ప్రదర్శన ఏర్పాటు చేస్తానని పేర్కొన్నారు.





## సూక్ష్మ రామాలయం నమూనా

కల్వకుర్తి రూరల్, జనవరి 21 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన శేఖరాచారి సూక్ష్మ రామ మందిరం, కలశం, రాములవారి విల్లు, శ్రీరాముడి పాదుకలను అతి సూక్ష్మ ఆకృతిలో తీర్చిదిద్దారు. అయోధ్యలోని శ్రీరామమందిరంలో రాములవారి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా శేఖరాచారి సుమారు 9 గ్రాముల పంచలోహాలతో వీటిని తయారు చేశారు. వీటిని అయోధ్యకు పంపించనున్నట్టు ఆయన తెలిపారు. అలాగే ఆయన కుమారుడు యశ్వంత్‌కుమార్ రామమందిర్ ఆలయ నమూనాను, చాక్‌పీస్‌పై రాములోరిని చిత్రించారు.



## 'గుమ్మడి'తో రామాలయం

ఎల్లారెడ్డిపేట, జనవరి 21: అయోధ్య రాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేళ రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేటకు చెందిన కార్వింగ్ కళాకారుడు శ్యామంతుల అనిల్ అద్భుతాన్ని ఆవిష్కరించారు. రెండు గుమ్మడి కాయలు, అరకిలో క్యారెట్లతో 12 అంగుళాల ఎత్తు, 16 అంగుళాల పొడవుతో నాలుగు గంటలు శ్రమించి ఆదివారం రామ మందిరాన్ని నిర్మించారు. అనిల్ గతంలో పుచ్చకాయపై కేసీఆర్, కేటీఆర్ చిత్రాలు, శివుడి ప్రతిమను చెక్కి ఆశ్చర్యపరిచారు.